

# దానం

తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి

అరణ్యంలో పచ్చగా అపరాహ్ణం అయింది. నీటిమడుగు చుట్టూ లేళ్ళు, లేళ్ళు నెమరేసుకుంటూ నిద్రావస్థలో ఉన్నాయి. మడుగుకి ఉత్తరంగా శౌనకాది మహామునులు ఆశ్రమ పర్ణ శాలలు నిర్మించు కున్నారు. అపరాహ్ణం అవడంచేత వారంతా అగ్నికార్యాలు ముగించుకుని పర్ణశాల బయట ఉన్న పెద్ద మర్రిచెట్టుకిందికి చేరేరు. అందరికంటే వృద్ధుడూ మహామునీ కావటం వల్ల శౌనకుడు ముందుగా గడ్డి చాపమీద ఆశీనుడయ్యాడు. కొందరు ఆదిమహామునులు కూడా కూర్చున్నారు. యువకులు ఆకులూ, ఆకు దొనెలూ అందరి ముందూ పెట్టేరు. వడ్డించడమే తరువాయి. ఫలహారం వడ్డించ బోతుండగా పక్షులు దూరంగా పెద్దగా కలరావాలు చేశాయి. శౌనకుడు కనుబొమ్మలు ముడిచి శబ్దం వచ్చిన దిశగా చూస్తూ అన్నాడు.

"ఎవరో ఆశ్రమం వైపేవస్తున్నారు."

మధ్యాహ్న సమయంలో ఆశ్రమానికి వచ్చే ఆగంతకులెవరో ఆయనకీ పాలుపోలేదు. అనేకమంది రాజులు తమ చేత చేయించు కోవలసిన యజ్ఞయాగాదులన్నీ ఇదివరకే చేయించుకున్నారు. మరికాసేపటికి శౌనకుడు ఊహించినట్టుగానే అశ్వారూఢులైన నలుగురు వ్యక్తులు మలుపుతిరిగి ఆశ్రమవాటిక కెదురుగా కనిపించారు. మునులను చెట్టుకింద చూడగానే వారు గుర్రాలు దిగి పాదచారులై మర్రిచెట్టు దగ్గిరకి వచ్చేరు. సమీపిస్తూనే మునిబృందానికి వినమ్రంగా నమస్కరించారు. శౌనకుడు వారిని ఆశీనులుకండని ఆదేశించాడు. ముగ్గురు ఆగంతకులు భయ భక్తులతో దూరంగా కూచుండి పోయారు. వాళ్ళలో ప్రముఖుడు మాత్రం శౌనకుడికి ఎదురుగా కూర్చున్నాడు.

"మహాముని, నన్ను వీరసేను డంటారు. ఈ అరణ్యం వెలుపల ఉన్న చిన్నరాజ్యానికి నేను మంత్రిని. ఒక చిన్న సమస్య విషయంలో మీ దర్శనార్థంవచ్చేను.

ఈ లోగా శౌనకుడి ఆకులో రెండు పళ్ళూ, కందమూలాలూ వడ్డించారు. ఆది మహా మునులకు కొంచెం ఆకలిగా ఉండటం చేత శౌనకుడు ప్రారంభించడం కోసం ఎదురు చూస్తున్నారు.

"అలాగా, మీరు మా అతిథులు."

అలా శౌనకుడు అనగానే వీరసేనుడు బెంగగా ఆకువేపు చూశాడు. అతిథుల్ని భోజనానికి ఉండమనడం గృహస్థులకూ సన్యాసులకీ కూడా విధాయకం. వీరసేనుడు దారిలో భిల్లగూడెంలో ఆగేడు. భిల్లులు భక్తితో సమర్పించిన రెండు మూడు ముంతల జీలుగు కల్లు పుచ్చుకున్నాడు. పులుల సంచారంగురించి వాకబు చేస్తూ కాల్చిన పక్షిమాంసం నంజుతూ మరోరెండు ముంతలతో మధ్యాహ్న భోజనం ముగించాడు. కడుపు నిండుగా, హాయిగా ఉండడంచేతనైతే నేమి, ఆకులో ఉన్న ఖాద్యపదార్థాల వల్ల నైతేనేమి వీరసేనుడికి భోజనం చెయ్యాలనే ప్రేరణ కలగటం లేదు. సాధ్యమైనంత వినయంగా అన్నాడతను.

"మునీంద్రా, మేమంతా భిల్లుల యోగక్షేమాలు విచారించి వారి ఆతిథ్యం స్వీకరించి, తేనె, కంద మూలములను కూడా కడుపారగా సేవించితిమి."

"మంచిది" అంటూ ఆది మహా మునులను భోజనం కానివ్వండని చెయ్యి ఊపేడు శౌనకుడు. నిశితంగా వీరసేనుడి వేపు చూస్తూ

"మీ ప్రభువుకి యజ్ఞఫలాపేక్ష కలిగిందను కుంటాను." అన్నాడు. వీరసేనుడు మరోసారి బెంగపడ్డాడు.చిత్తము. కానీవారు ప్రస్తుతము అనారోగ్యంతో ఉండడంచేత అటువంటి తలపు లేదు. నేను వచ్చిన పని మిక్కిలి ప్రాపంచికమైనది. ఆధ్యాత్మ సంబంధి కాదు."

"మంచిది."

ఇంతలో ఎవరో గోక్షీరం వీరసేనుడి ముందుంచారు. దాన్ని పుచ్చుకుంటూ తనను వేధిస్తున్న సమస్యను విన్నవించుకున్నాడు వీరసేనుడు.

"మునీంద్రా, మాది చిన్నరాజ్యం, కేవలం రక్షణ కోసం కొంత సైన్యాన్ని పోషిస్తున్నాం. పదాతిదళం కాక మాకు కొంత అశ్విక దళం కూడా ఉంది. అశ్వికుల్ని రాజుగారే పోషిస్తారు. వారికి వేతనం ధాన్యరూపంలో ఇవ్వబడుతోంది. కేవలం సేనలో ఉండడమే గాక వారిలో అనేకమంది తోచిన చోట పొలాలు సాగుచేసుకుంటుంటారు. దీనివల్ల మాకు నష్టం లేదు. సమస్యఅల్లా గుర్రాలకు వేయించే గడ్డి దగ్గిర మెదలైంది."


"అటులనా?"

చిత్తం. గుర్రాలను జాగ్రత్తగా చూసుకోవడం, వాటికి సరిపడా ఆహారం ఇవ్వడం అశ్వికుల బాధ్యత.దీనికి కూడా నిజానికి మేము ఏర్పాటు చేశాం. కొంతమంది మోపులవారిని నియమించి, వారు ప్రతిరోజూ సాయంకాలం అశ్వశాలలకు గడ్డి చేరవేసే ఒక పద్ధతి ఏర్పాటు చేశాం. ఇందులోకూడా ఒక్కోవ్యక్తి ఇన్నిమోపులు తేవాలనే నిబంధన ఉంది. వాటికి మేమే ప్రతిఫలం ముట్టచెపుతాం. అశ్వికులు చెయ్య వలసినదల్లా మోపులవారు సక్రమంగా తెస్తున్నారా లేదా అని చూసుకోవడం , ఎన్ని మోపులు తెస్తే అన్ని రాగిముక్కలు ఇస్తారు. వాటిని గణకులు చూసి మోపులవారి వేతనాలు ఇస్తాం, అంటే అశ్వికులు చెప్పనిదే ఒక్కపణం కూడా ఇవ్వం."

"మరి సమస్య ఏముంది!"

పద్ధతిలో సమస్య లేదు. మహామునీ, దాన్ని అమలు చెయ్యడంలోనే ఏర్పడింది. ఇటీవల నేను అశ్వశాలలు సందర్శించడం జరిగింది. అనేక అశ్వాలు చిక్కిపోయి నిర్జీవంగా కనిపించాయి. అవసరమైతే అశ్వికుల్ని అవి మోయగలవని అనిపించ లేదు. అశ్వికుల్ని ప్రశ్నించాను. సంతృప్తికరమైన సమాధానం లేదు. వైద్యనిపుణుడు ఆహారలోపం తప్ప మరేవ్యాధీ లేదని నిర్ణయించాడు. గణకులు మోపుల వారు సక్రమంగానే వస్తున్నారని చెప్పేడు. కొంచెం శ్రమపడ్డా మోసాన్ని గుర్తించడానికి ఎక్కువ కాలం పట్టలేదు. మోపులవారూ అశ్వికులూ కలిసి ఒక పద్ధతి ప్రకారం, కొద్దిమంది తెచ్చిన గడ్డినే అందరూ పంచుకుంటూ మేం ఇచ్చే వేతనంలో అశ్వికులకు కొంత ముట్ట చెబుతున్నారు. గుర్రాలు ఆహారం లేక చిక్కి పోతున్నాయి."

శౌనకుడు ఈ మాట వినగానే కంద మూలం ముక్క గొంతులో పడి, పొరబోయి, దగ్గి అన్నాడు.



"అవినీతి, అధర్మం. రాజద్రోహం, మహాపాపం."

"చిత్తం మునీంద్రా."

"ద్రోహుల్ని శిక్షించారా!"

"లేదు. సరైన ఆధారం లేదు. ఇరు పక్షాలవారికీ కుదిరిన అద్భుతమైన అవగాహన వల్ల మేము ఏమీ చెయ్యలేక పోయాం. ఎంత చిన్నఅధికారం చేతిలో ఉన్నా దాన్ని దుర్వినియోగం చెయ్యడం అధికారుల రక్తంలో ఉంది మునీంద్రా. ఈ మోసం జరక్కుండా తరుణోపాయం సూచించగలరని తమని ఆశ్రయించాను. "

"మంత్రి వర్యా, ఆర్యావర్తంలో అధర్మానికి తావులేదు. మాకు ఒకటే పరిష్కారం గోచరిస్తోంది. అశ్వికులమీదా, మోపులవారి మీదా మోసం జరక్కుండా ఒక అధికారిని నియమించండి. అతడికి గ్రాసాధ్యక్షుడని నామకరణం చెయ్యండి."

"చిత్తం మునీంద్రా. మరినాకు శలవిప్పించండి."

"వెళ్ళిరండి. శుభం."

అందరూ మునులకు పాదాభివందనం చేసి గుర్రాలెక్కి వెళ్లిపోయారు. వీరసేనుడికి దారిలో మళ్లీ భిల్లుల యోగక్షేమాలు విచారించా, లనిపించింది. మార్గాయానం తెలీకుండా కడుపునిండా జీలుగుకల్లుసేవించి గూడెం నుంచి గాజధానికి బయలుదేరేడు.

శౌనకుడు, ఆది మహామునులు కూడా మర్నాడే వీరసేనుణ్ని మర్చి పోయారు. ఒక ఏడాది గడచిపోయింది. దూరప్రాంతంలో ఒక చోట శౌనకాది మహా మునులు యజ్ఞం చేయించి అక్కడే కొంత కాలం ఉండిపోయి తిరిగివస్తూ కాకతాళీయంగా వీరసేనుడి రాజ్యం మీదుగా ఆశ్రమానికి బయలుదేరారు. వారు రాజధానిలోకిఅడుగుపెట్టగానే వీరసేనుడు, రాజు సపరివారంగా ఎదురు వెళ్లి పాదాభి వందనం చేశారు. యోగక్షేమాలు విచారించిన తరువాత అందరూ రాజప్రాసాదానికి బయలు దేరేరు. ముందు రాజు,వీరసేనుడు, సేనాని ఇతరులూ, వారి వెనుక మునిబృందం, వారి వెనుక మూడు వరుసలలో పరిచారకులూ. దారి పొడుగునా ప్రజల నమస్కారాలు స్వీకరిస్తూ శౌనకుడు, తమ వెనుక పరిచారకులు నాలుగు పెద్ద కుక్కల్ని మెడలో తాడు వేసి కొంచెం బలవంతంగా నడిపిస్తూండడం గమనించాడు.

"వీరసేనా ఇంత పెద్ద శునకములను ఇతఃపూర్వం మేము ఎన్నడూ చూడలేదు."

"చిత్తం మునీంద్రా, అంత శునకములు ఇవ్వుడునూ లేవు. మీరు చూచుచున్నవి అశ్వములు."

సంధ్యాసమయం. ఉద్యానవనంలో శౌనకుడు అయన ఎదురుగ నీరసించిపోయిన వీరసేనుడు కూచున్నారు. ఆది మహామునులు దూరంగా చెట్లకింద విశ్రమించారు.

"వీరసేనా, ఆ శున ..... అశ్వముల గురించి......."వీరసేనుడు రెండు పచ్చగడ్డి పరకలు తెంపి, వాటివేపు తాత్వికంగా చూస్తూ అన్నాడు.

"మునీంద్రా అవధరింపుడు. మీ ఆదేశానుసారం రాజధానికి తిరిగివచ్చి మీ సూచన రాజుగారికి విన్నవించాను. సేనాపతిని పిలిపించి వారితో చర్చించిన తరువాత ఒక గ్రాసాధ్యక్షుణ్ని నియమించాను. అధ్యక్షుడు ఆత్మీయుడైతే ఉచితంగా ఉంటుందన్న సేనాని సలహాననుసరించి అతని రెండవ భార్య సోదరుణ్ని గ్రాసాధ్యక్షునిగా నియమించాం."


"మంచిది."

వరధ్యానంగా నోట్లోపెట్టుకున్న గడ్డిపరకని చేత్తో తీస్తూ వీరసేనుడు చెప్తున్నాడు.

"ఒక మాసం తరువాత అధ్యక్షులవారు నా దగ్గరకి వచ్చేరు. మోపుల వారిమీద రహస్య సమాచారం సేకరించడానికి మరో నలుగురు ఉద్యోగులను, వారిని పర్యవేక్షించడానికి ఒక ఉపాధ్యక్షుడ్ని నియమించాలని సూచించారు. వారిని పర్యవేక్షించడానికి ఒక ఉపాధ్యక్షుణ్ని నియమించాలని సూచించారు. వారి వేతనములు నిర్ణయించి అంగీకరించాను. ఈ

## వేదిక

మతతత్వం పెచ్చు పెరిగి పోతున్న వర్తమాన స్థితిలో మేధావులు, రచయితల నిజమైనా బాధ్యతని గుర్తు చేస్తూ వివిధ కార్యక్రమాలు చేపట్టడానికి 'వేదిక ' అనే ప్రజసాహిత్య సాంస్కృతిక సంఘటన ఏర్పడింది ఈ వేదిక తొలి కార్యక్రమంగా హైదరాబాదులో ఇటీవల మత, సామ్రాజ్యవాద సంస్కృతి సాహిత్య సంబంధాలపై వొక సభ నిర్వహించింది ఈ సభలో ఎం.టి. ఖాన్, జ్వాలాముఖి, కె. శివారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగానే పర్యావరణ ఉద్యమానికి ప్రాణాన్నే త్యాగం చేసిన కెన్‌సారో వివాస్మృతికి ప్రజారచయితల సమాఖ్య ప్రచురించిన 'కెన్‌సారో వివా కోసం' అనే కవితా సంకలనం ఆవిష్కరణ జరిగింది ఈ తర్వాత జరిగిన కవిసమ్మేళనంలో కె.శివారెడ్డి, దేవి ప్రియ, నిఖిలేశ్వర్ , నగ్నముని, అఫ్సర్, నందిని , విధారెడ్డి, కొండేపూడి నిర్మల, నమ్ము శిలా వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. సామ్రాజ్యవాద, మతోన్మాద సంస్కృతిని ప్రతిఫలిస్తూ రచయితల వైపు నుంచి జరిగిన ఈ కార్యక్రమం విజయవంతమైంది.



ఉద్యోగుల నమ్మకం, విధేయత బాగా ఉన్న వాళ్లయితే మంచిదనే ఉద్దేశ్యంతో అధ్యక్షుల వారు వారికి ఆత్మీయంగా తెలిసిన వారినే నియమించడం జరిగింది. ఇలా కొన్ని మాసములు గడిచినవి. కారణాంతరాల వల్ల గుర్రములు శుష్కించే కనిపించాయి."

"కానీ వీరసేనా"

"చిత్తము"

"మీరు మధ్యలో గడ్డి చప్పరించు చున్నారు."వీరసేనుడు నోట్లో గడ్డి పరకలను విషాదంగా ఉమ్మి అన్నాడు.

"క్షంతవ్యుణ్ని. అది చాలా కీలకమైన సమావేశం. గ్రాసాధ్యక్షుడు తన నివేదికలో పరిపాలనా సంస్కరణలు పూర్తిగా జరగక పోవడం వల్లనే గుర్రాలకూ గడ్డికీ మధ్య అంతరాయం ఏర్పడుతోందని స్పష్టం చేశారు. గ్రాసోద్యోగులు కూడా వారి నివేదికలలో అధ్యక్షుల వారితో అంగీకరించారు. సమావేశం ముగిసేలోగా నేనే ఆలోచించి గుర్రాలకు గడ్డి సమకూర్చే మోపులవారిని తొలగించాను. "

"కారణం ?"

నేను నా ఉద్యోగుల ద్వారా కొంత సమాచారం సేకరించాను. అధ్యక్షులవారూ, ఉద్యోగులూ, ఉపాధ్యక్షులవారూ, మోపుల వారూ, అశ్వికులూ పరస్పరం సహకరించు కుంటూ పూర్వ పద్ధతినే కొంచెం కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు."

బాగు బాగు.

వీరసేనుడు వడగాల్పు వంటి నిట్టూర్పు వదిలి అందుకున్నాడు.

"మోపులవారిని తొలగించామని చెప్పగానే మేము ఊహించనిధర్మసూక్ష్మాన్ని అధ్యక్షులవారు లేవనెత్తేరు. పేదలు, ఇతర ఆధారం లేని మోపులవారిని తొలగించడం అధర్మమనీ, వారి భార్యాదుల ఉసురు ప్రభువు వారికి తగులుతుందనీ, ఆ దుర్దశను తొలగించ డానికి మోపుల వారిని రాజోద్యానంలో నియ మించడం న్యాయ సమ్మతమనీ అధ్యక్షులవారు పట్టుపట్టేరు."

శౌనకుడు వీరసేనుడి భుజం మీంచి చూసాడు. దూరంగా ఒక మందార మొక్క చుట్టూ నలుగురు కూచుని కనిపించారు.

"వారే." అన్నాడు వీరసేనుడు సాభిప్రాయంగా

"ఊ, తరువాత?

"ఆ మరునాడు సూర్యాస్తమయం లోగా రాజుగారి నుంచి నాకు వర్తమానం వచ్చింది. గ్రాసోద్యోగులు, అశ్వికులు సేనకి సంబంధించిన విషయాలు కావడం చేత, నేను గ్రాసోద్యోగుల విధి నిర్వహణకు అంతరాయం కలిగిస్తున్నానని తెలియడం చేత నన్ను ఆ బాధ్యతల నుండి విముక్తుణ్ని చేశారు.

"ఆ !"

"అవును మునీంద్రా. సేనకి సంబంధించిన విషయం కావడం వల్ల గ్రాసోద్యోగు లందరూ సేనాపతి పర్యవేక్షణ కిందికి వచ్చేరు. సేనాని దీనికి ఒక ప్రత్యేక శాఖను ఏర్పరచి కొత్త ఉద్యోగులను మరి కొంత మందిని నియమించారు. సేనాని, గ్రాసాధ్యక్షుడూ సమస్య పరిష్కరించడానికి రాజుగారి అనుమతితో పశుగ్రాస క్షేత్రాలు వేయించారు".

"అనగా ?"

"రాజధాని వెలువల సేనాని గ్రామములో గుర్రములకు శాశ్వతముగా ఆరోగ్యకరమైన గడ్డి ఏర్పరచడానికి ప్రత్యేకించి పశుగ్రాసం వెయ్యడానికి పొలాలు తీసు కున్నారు. గడ్డి నేరుగా అశ్వశాలలకు వెళ్లే యంత్రాంగం ఏర్పాటు చెయ్యబడింది. మునీంద్రా, కొంతమంది బళ్లవాళ్లనీ, బళ్లవారిని పర్యవేక్షించడానికి కొంతమంది వృషభాధ్యక్షు లనూ, గడ్డి పెంచడానికి కొయ్య డానికీ అనేక మంది పనివారినీ నియమించడం జరిగింది"

"మంచిది".

"వీరందరి వేతనములు ఇతర అవసరములు చూడ్డానికి ప్రత్యేకంగా కొంత మంది గణకులు, ఉపగణకులు వారి మీద ఒక అధికారి కూడా నియమించబడ్డారు. రాజధాని వెలుపల గ్రామం కావడం చేత కొంత మంది గ్రాసోద్యోగులకు అక్కడే కుటీరములు నిర్మించి ఇవ్వడం కూడా జరిగింది."

"ఉద్యోగులకు న్యాయము జరిగినది".

"నిక్కము మునీంద్రా. అనుకున్న విధంగా పొలాలలో పశుగ్రాసం వెయ్యబడింది. గడ్డి పచ్చగా ఏపుగా పెరిగింది. బళ్లు పశుగ్రాసాన్ని తీసుకువెడుతున్నాయి. ఒకనాడు కుతూహలం కలిగి నేను అశ్వశాలలకు వెళ్లాను. నాకు కూడా మీకు వలెనే శునకాశ్వములే కనిపించాయి".

"ఆశ్చర్యం".

"పశుగ్రాసం కొంత, కూరగాయలు కొంత, వరికొంత, గ్రాసాధ్యక్షుడి పర్యవేక్షణలో వెయ్యబడింది. కూరగాయలనూ, పంటనూ విక్రయించడానికి గ్రామంలో వెలుపలా ఒక పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటుచేశారు. దీనికోసం కొంతమంది వ్యాపారులతో ఒప్పందములు కుదుర్చుకున్నారు. ఉద్యోగు లందరికీ కూరగాయలూ, వరిధాన్యం, పాలూ ఉచితంగా లభిస్తూండడమే కాక గడ్డితో సహా అవన్నీ అమ్మడం వల్ల వచ్చిన ధనం కూడా మిగుల్తోంది. గ్రాసాధ్యక్షుడు, సేనాని, ఉపాధ్యక్షుడు, గ్రాసోద్యోగులు, గణకులు, వృషభాధ్యక్షులు, అశ్వికులు ఇతరులూ ఐకమత్యముగా పాలూ తేనె వలె కలిసి ఈ యంత్రాంగాన్ని సమర్థవంతంగా నిర్వ హిస్తున్నారు. వీరందరినీ ని-మించి సంవత్సర కాలం పూర్తి కావడం వల్ల అందరికీ వేతనములు పెరిగినవి".

"అటులనా ?"

"అవును మునీంద్రా. గ్రాసోద్యోగులు అందరూ ఎంతో ఆనందముగా, ఆరోగ్యముగా నున్నారు. గుర్రములు తప్ప." ♣

